

28 నుంచి బిఎస్‌ఎన్‌ఎల్ విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం, పార్వతీపురం (మన్యం) జిల్లాల పరిధిలో ఈనెల 28 నుంచి వచ్చే నెల మూడో తేదీ వరకు బిఎస్‌ఎన్‌ఎల్ విజిలెన్స్ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ జనరల్ మేనేజర్ నాయుడు మద్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాల్లో సంస్థకు సంబంధించిన అవినీతిపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫిర్యాదులను నేరుగా గానీ ఫోన్ ద్వారా గానీ ఇవ్వాలని సూచించారు. ఫోన్ ద్వారా సమాచారం అందించాల్సిన వారు 08942 226700, 9441668789 ఫోన్ నంబర్లకు ఫిర్యాదు చేయొచ్చని సూచించారు.

'జమిలీ'ని ప్రజలే తిరస్కరించారు

- 400 సీట్లు అడిగిన మోడీకి మెజార్టీ కూడా ఇవ్వలేదు
- మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ



మాట్లాడుతున్న రచయిత అట్టాడ అప్పలనాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పునే జమిలీ ఎన్నికలను వారు తిరస్కరించినట్లుగా ప్రధాని మోడీ అర్థం చేసుకోవాలని ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిరంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన 'ప్రజాస్వామ్య భారతం - జమిలీ ఎన్నికలు' అనే అంశంపై గురువారం నిర్వహించిన సెమినార్‌లో ప్రసంగించారు. తనకు 400 సీట్లు ఇవ్వాలని మోడీ అడిగితే ప్రజలు కనీసం మెజార్టీ స్థానాల్లోనూ బిజెపిని గెలిపించలేదన్నారు. ప్రజాస్వామ్యం ప్రజలకు సంబంధించిన అంశమని, పాలకులకు కాదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియను నిర్ణయించేది ప్రజలా, కేంద్ర ప్రభుత్వమా అని ప్రశ్నించారు. ధరలు, నిరుద్యోగం, కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలపై ప్రజలు మాట్లాడకుండా జమిలీ ఎన్నికల పేరుతో మోడీ ప్రజల్లో పనికిమాలిన చర్చ పెట్టారని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల పాత్ర, పాలనలో వారి భాగస్వామ్యం పెరగాలన్నారు. సహకార, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ఆసుపత్రి కమిటీ ఇలా అన్ని వ్యవస్థలు ప్రజల భాగస్వామ్యంతో ముడిపడి ఉన్నా, వాటికి నామినేటెట్ సభ్యులను నియమిస్తూ ప్రజాసామ్య వ్యవస్థను దెబ్బతీస్తున్నారని చెప్పారు. ప్రజల అభిప్రాయాన్ని గౌరవించినప్పుడే ప్రజాస్వామ్యానికి విలువ ఉంటుందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపు కోసం ప్రజల అభిప్రాయాన్ని తీసుకుని వారు వద్దంటున్నా, వారిపై భారాలు వేస్తున్నారని చెప్పారు. జమిలీ ఎన్నికలు ప్రజాస్వామ్యంపై దాడిగా ఆయన అభివర్ణించారు. మోడీ జమిలీ ఎన్నికలు అంటే రాష్ట్రంలోని అధికార టిడిపి, ప్రతిపక్ష వైసిపి సంబరపడిపోతున్నాయని అన్నారు. ఫెడరల్ వ్యవస్థకు ఇది తీవ్ర విఘాతమన్న స్పృహ ఇద్దరిలో లేకుండా పోయిందన్నారు. జమిలీ ఎన్నికల అంశాన్ని సీరియస్‌గా తీసుకుని ప్రజల ముందుంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజాభిప్రాయాన్ని కాదని, మోడీ బలవంతంగా వెళ్తే దాని పర్యవసానాలను బిజెపి ప్రభుత్వం ఎదుర్కోక తప్పదన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకే...

ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ జమిలీ ఎన్నికలతో పాలకులు కోరుకునే అజెండా వేరుగా ఉందన్నారు. ఒకే దేశం - ఒకే ఎన్నిక తీసుకురావాలని ప్రయత్నిస్తున్న మోడీ, ముందు దేశ ప్రజలందరూ ఒకేటనన్న జాతీయ భావాన్ని తీసుకురావాలని హితవు పలికారు. ఎన్నికలను స్వేచ్ఛగా, అక్రమాలకు తావు లేకుండా నిర్వహించలేని పరిస్థితుల్లో, జమిలీ ఎన్నికల పేరుతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు మోడీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కన్వీనర్ వి.జి.కె మూర్తి అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో దళిత జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కళ్ళేపల్లి రామ్‌గోపాల్, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కిలారి ఈశ్వరరావు, ఐ.ఎం.ఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ సనపల నరసింహమూర్తి, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.వేణుగోపాల్, యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు చౌదరి.రవీంద్ర, ముస్లిం జెఎసి కన్వీనర్ మెహబుల్లాఖాన్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఐద్వా జిల్లా కన్వీనర్ ఎ.లక్ష్మి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ ప్రసంగించారు. గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు ఎం.ప్రభాకరరావు, పి.సుధాకరరావు, ఆర్.మధు, కె.ఎస్.ఎన్ మూర్తి, పి.వి.రమణమూర్తి, జిలానీ, కె.ఎస్.రామకష్ణారావు, సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాస్, కళాకారులు రామచంద్రరావు, శ్రీనివాసరావు, పలు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కపాసుకుద్దిలో ఎగసిపడుతున్న అలలు

హమ్మయ్య... ముప్పు తప్పింది

ప్రజాశక్తి - కవిటి

హమ్మయ్య.. ముప్పు తప్పింది అంటూ ఉద్దానం రైతాంగం ఊపిరి పీల్చుకుంది. దానా తుపాను నేపథ్యంలో ఐదు రోజులుగా ఏ క్షణం ఏం జరుగుతుందోనని భయం భయంగా గడిపిన రైతాంగం, తుపాను ఒడిశాలో తీరం దాటనుండడంతో ఊపిరి పీల్చుకుంది. ముఖ్యంగా ఒడిశాలో గోపాల్‌పూర్, పూరీ, భువనేశ్వర్ వరకు ఎక్కడ తీరం తాకినా ఇచ్ఛాపురం నియోజకవర్గం రైతాంగం దారుణంగా దెబ్బతిన్న సందర్భాలు అనేకం. ప్రస్తుత తుపాను పూరీ సమీపంలో తాకుతుందని తెలియడంతో రైతులు నిద్రలేని రాత్రులు గడిపారు. తుపాను దిశ మార్చుకోవడంతో భారీ నష్టం తప్పింది. ముఖ్యంగా ఉద్యానవన పంటలకు పెట్టింది పేరైన కవిటి మండలం గతంలో 1999 సూపర్ సైక్లోన్, ఆ తర్వాత ఫైలిన్, తిత్లీ దెబ్బకు అతలాకుతలమైంది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఉద్యాన పంటలకు చిన్న దెబ్బ తగిలినా రైతులు కోలుకోవడం కష్టం. అడపాదడపా కురిసిన వర్షాలకు ఈ ఏడాది ఖరీఫ్ కళకళలాడుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రకృతి విపత్తులు సంభవిస్తే రైతు పరిస్థితి అగమ్యగోచరమే. ఏదేమైనా తుపాను ఒడిశా వైపు వెళ్లడం ఉద్దానం రైతాంగానికి ఊపిరి వచ్చినట్లయింది. మరోవైపు దానా తుపాను ప్రభావంతో తీరంలో కెరటాలు ఎగసిపడుతున్నాయి. ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు వేటకు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. తీరం వెంబడి గ్రామాల్లో అక్కడక్కడా చిరుజల్లులు కురిశాయి.

తెలినీలాపురానికి పూర్వ వైభవం తీసుకొస్తా

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



ఎత్తిపోతల పథకాన్ని స్విచ్ ఆన్ చేసి పున:ప్రారంభిస్తున్న అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి, రూరల్

పక్షుల విడిది కేంద్రం తెలినీలాపురానికి పూర్వ వైభవం తీసుకువచ్చి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. తెలినీలాపురానికి రూ.1.95 కోట్లు మంజూరు చేయడమైందన్నారు. మండలంలోని మదనగోపాలసాగరం ఎత్తిపోతల పథకాన్ని గురువారం పున:ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు పథకాలకు సంబంధించి 11 ట్రాన్స్ ఫార్మర్లు విలువైన విడి భాగాలు చోరీకి గురవగా, మరమ్మతులకు రూ.78.85 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వంశధార ఎడమ ప్రధాన కాలువ ద్వారా పలాసకు నీరు అందించినట్లు చెప్పారు. శివారు ప్రాంతాలకు నీరందడం లేదని, వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి అన్ని ప్రాంతాలకు నీరందిస్తామని హామీనిచ్చారు. టెక్కలిలో ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేట్ భవనాల్లో ఉన్నాయో వాటిని పది రోజుల్లో గుర్తించాలని ఆర్‌డిఒను ఆదేశించినట్లు తెలిపారు. అన్ని కార్యాలయాలు దగ్గర దగ్గరగా ఉంటే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రహదారుల విస్తరణ కూడా చేయాల్సి ఉందని, అందరూ సహకరించాలని కోరారు. ఎండల మల్లికార్జున స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్తీక మాస ఉత్సవాలు పూర్తయ్యాక గాలిగోపురం నిర్మాణం చేపట్టాలన్నారు. రావివలస యాత్రికులకు ఇబ్బందులు లేకుండా రూ.63 లక్షలతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. పట్టనంలో రోడ్లపై ఉన్న పశువులను పశు సంరక్షణ కేంద్రానికి తరలించాలని పంచాయతీ కార్యదర్శి కె.వి.వి జగన్నాథరావును ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి, పశు సంవర్థకశాఖ ఎడి జయరాజ్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి నాయకులు ఎల్.ఎల్ నాయుడు, బగాది శేషగిరిరావు పినకాన అజయ్ కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం ప్రతినిధులు

లీజు హక్కును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - నౌపడ

నౌపడ ఉప్పు కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించి, జీవనభృతికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని జిల్లా పౌర హక్కుల పరిరక్షణ సంఘం డిమాండ్ చేసింది. సంతబొమ్మాళి మండలం నౌపడ పరిసర ప్రాంతాల్లో గురువారం పర్యటించి ఉప్పు రైతులు, కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షులు పత్తిరి దానేష్ మాట్లాడుతూ ఉప్పు రైతులు, కార్మికులు సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. సన్నకారు ఉప్పు రైతులకు కేంద్రం లీజు హక్కులను పునరుద్ధరించాలని, ఉప్పు రైతులకు ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉప్పు ఉత్పత్తి పరిశ్రమలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కాపాడాలన్నారు. ఉప్పు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి గిట్టుబాటు ధరకు కొనాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వాటిల్లిన నష్టానికి పరిహారం అందేలా చూడాలన్నారు. ఉప్పును నిల్వ చేసేందుకు గోడౌన్స్, స్టోరేజ్ రూములు ఏర్పాటు చేయాలని కోరారు. ఉప్పు అనుబంధ పరిశ్రమలు నెలకొల్పి ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ఉప్పు రైతులకు పెట్టుబడి సహాయంగా ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించాలన్నారు. కార్మికులకు బీమా సౌకర్యాన్ని కల్పించాలి కోరారు. దళారీ వ్యవస్థ పూర్తిగా లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఉప్పు భూముల లీజు హక్కులు ప్రభుత్వం పునరుద్ధరించకపోతే, ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ సహాయక కార్యదర్శి యు.సోమనాథం, పిట్ట జోగారావు, తెప్పల ఢిల్లీరావు, పోతనపల్లి వైకుంఠరావు, లక్ష్మణ్, మద్దిల పోలారావు పాల్గొన్నారు.



హైవే విస్తరణకు రూ.252.42 కోట్లు

- రణస్థలం వద్ద ఆరు లైన్లతో జాతీయ రహదారి
- నిధులు మంజూరు చేసిన కేంద్రం
- ఫలించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ చొరవ



నితిన్ గడ్కరీతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా అభివృద్ధిలో కీలకమైన జాతీయ రహదారి విస్తరణకు మార్గం సుగమమైంది. నరసన్నపేట - శ్రీకాకుళం - విశాఖపట్నం మధ్య కీలకంగా ఉన్న ఈ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేయాలని కోరుతూ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్రంపై తీసుకొచ్చిన ఒత్తిడి ఫలించింది. ఈ మేరకు చాలాకాలంగా పెండింగ్ లో ఉన్న 16వ నంబరు జాతీయ రహదారి మార్గంలోని రణస్థలం వద్ద హైవే విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ.252.42 కోట్లు మంజూరు చేసింది. కేంద్ర కేబినెట్ సమావేశంలో జిల్లాలోని రణస్థలం వద్ద హైవే విస్తరణకు సవరణలతో కూడిన కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా రూ.252.42 కోట్లు కేటాయిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది.

తొలగిన అడ్డంకులు

16వ నంబరు జాతీయ రహదారిలోని విశాఖపట్నం - శ్రీకాకుళం - నరసన్నపేట మధ్య ఆరు లైన్లతో వంద కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణకు నిధులు కేటాయించాలని అప్పట్లో ఎంపీగా ఉన్న ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిసి, ప్రతిపాదనలు అందించారు. దీంతో రూ.మూడు వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం, రణస్థలం మినహా మిగతా మార్గంలో నిర్మాణాలు పూర్తి చేసింది. 2014లో చేపట్టిన సర్వే ప్రకారమే భూములు, ఆస్తులు కోల్పోయిన వారికి పరిహారం ఇస్తామని చెప్పడంతో రైతులు దీనికి అంగీకరించలేదు. సమస్యను సవాల్‌గా స్వీకరించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు బాధ్యతలు స్వీకరించనప్పట్నుంచీ కేబినెట్‌లో పలుమార్లు ప్రస్తావిస్తూ వస్తున్నారు. తాజాగా కేంద్ర మంత్రిమండలి ఆమోదంతో ఏళ్లుగా పెండింగ్‌లో ఉండిపోయిన ఈ నిర్మాణాలు... మళ్లీ పట్టాలెక్కనున్నాయి. జిల్లా ప్రగతిలో భాగమైన హైవేల విస్తరణకు ఆమోదం తెలిపిన ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీకి రామ్మోహన్ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయ్ కుమార్ తదితరులు

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కార్తీక మాసంలో పంచారామ క్షేత్రాలు, పిక్నిక్ స్పాట్లకు వెళ్లేందుకు ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. నగరంలోని ఆర్‌టిసి ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక సర్వీసుల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచారామ క్షేత్రాలైన అమరావతి, పాలకొల్లు, భీమవరం, ద్రాక్షారామం, సామర్లకోట క్షేత్రాలను సందర్శించడానికి సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రతి ఆదివారం ఈ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. వచ్చే నెల 3, 10, 17, 24 తేదీల్లో సాయంత్రం నాలుగు గంటలకు శ్రీకాకుళం బస్ కాంప్లెక్స్ నుంచి బస్సులు బయలుదేరుతాయని చెప్పారు. శ్రీకాకుళం నుంచి ఒక్కొక్కరికి సూపర్ లగ్జరీకి రూ.2,400, అల్ట్రా డీలక్స్ రూ.2,350, ఎక్స్‌ప్రెస్ రూ.రెండు వేలు టిక్కెట్‌గా నిర్ణయించినట్లు తెలిపారు. టిక్కెట్లను apsrtconline.in వెబ్‌సైట్‌లో గానీ డిపో కౌంటర్లలో బుక్ చేసుకోవచ్చన్నారు. ప్రత్యేకంగా బస్సును బుక్ చేసుకునే వారికి వారు కోరిన ప్రదేశానికి బస్సు పంపిస్తామని వివరించారు. శబరిమల యాత్రకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. శ్రీకాకుళం నుంచి ఆరు రోజుల యాత్రలో భాగంగా విజయవాడ, కాణిపాకం, శ్రీపురం, భవాని, ఫళని, ఎరుమేలి, పంబ, సన్నిధానం, తిరుపతి, శ్రీకాళహస్తి, అన్నవరం సందర్శన తరువాత శ్రీకాకుళం చేరుకుంటాయన్నారు. శ్రీకాకుళం నుంచి విశాఖ దర్శిని, అరకు దర్శిని, శైవ క్షేత్రాల దర్శిని, కోరుకున్న ప్రాంతాలకు పిక్నిక్ స్పాట్లకు వెళ్లేందుకు అద్దె ప్రాతిపదికన బస్సులు కేటాయిస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళం ఒకటో డిపో 9959225608, రెండో డిపో 9959225608, పలాస డిపో 7382921647, టెక్కలి డిపో 9959225609 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

'పంటల బీమా'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రానున్న రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమా పథకాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని వ్యవసాయశాఖ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ తెలిపారు. పంటల బీమాపై అమరావతి నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పంటల బీమాకు సంబంధించి ఇతరుల ప్రమేయం లేకుండా రైతులే నేరుగా నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా ప్రీమియం కట్టుకునే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమీపంలోని గ్రామ సచివాలయంలోనూ ప్రీమియం చెల్లించవచ్చన్నారు. ప్రతి రైతు, కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు. రాష్ట్రంలో ఎనిమిది లక్షల మంది కౌలు రైతులుండగా, రెండు లక్షల మందికి మాత్రమే బ్యాంకు రుణాలు అందాయన్నారు. మిగిలిన వారి పేర్లు జాబితాలకు దగ్గరలో గల బ్యాంకులకు లింకు చేసి వారికీ రుణాలందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పంటల బీమా చేసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు తెలియజేసి, వారికి అవగాహన కల్పించాలన్నారు. గడువులోగా పంటల బీమా ప్రీమియం చెల్లించే విధంగా రైతులను అప్రమత్తం చేయాలన్నారు. రబీకి సంబంధించి జీడి పంటకు నవంబరు 15వ తేదీ ఇతర పంటలకు డిసెంబరు 15వ తేదీ ఆఖరు తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. గడువులోగా ప్రీమియం చెల్లిస్తే, భవిష్యత్‌లో పంట నష్టం వాటిల్లితే పరిహారం పొందవచ్చన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జీడి మామిడి విస్తీర్ణం ఎక్కువగా ఉన్నందున లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ అందజేయాలని వ్యవసాయ శాఖ జెడి త్రినాథస్వామిని ఆదేశించారు. సమావేశంలో సిపిఒ ప్రసన్నలక్ష్మి, డిసిసిబి సిఇఒ వరప్రసాద్, పలు బీమా కంపెనీల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారీగా పట్టుబడిన గంజాయి?



గంజాయితో పట్టుబడిన వ్యాను

ప్రజాశక్తి - మెళియాపుట్టి

ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి పలాసకు భారీగా తరలిస్తున్న గంజాయి సినీ ఫక్కీలో పట్టుబడింది. గంజాయి తరలిస్తున్న వ్యాను మండలంలోని జాడుపల్లి వద్ద సవరజాడుపల్లికి చెందిన యేసయ్యను ఢీకొట్టి వెళ్లిపోయింది. స్థానికులు కేకలు వేసినా నిలుపుదల చేయకపోవడంతో పక్క గ్రామమైన టి.కె.ఆర్ పురానికి చెందిన వారికి ఫోన్ చేసి విషయాన్ని చెప్పారు. అక్కడ వారు వ్యాన్‌ను అడ్డగించడంతో, తిరిగి వెనక్కి వచ్చాడు. అప్పటికే సవరజాడుపల్లి గ్రామం వద్ద గ్రామస్తులు ఉండడంతో, డ్రైవర్ వాహనం వదిలి పరారయ్యాడు. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని వ్యానులో ఉన్న మూటలను పరిశీలించగా, గంజాయిగా గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనం నంబరు ఆధారంగా యజమాని, డ్రైవర్ కోసం గాలిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టుబడిన గంజాయి 600 కేజీలు ఉంటుందని స్థానికులు చెప్తున్నారు. దీన్ని పోలీసులు ధ్రువీకరించాల్సి ఉంది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో గల వసుంధర, పట్టుపురం చెక్‌పోస్టులు ఉన్నా, అక్కడ తనిఖీలు చేపట్టకపోవడంతో పర్లాకిమిడి నుంచి గంజాయిని ఇటువైపుగా అక్రమంగా రవాణా చేస్తున్నారు.

రాష్ట్ర పండగగా రథసప్తమి

ముఖ్యమంత్రిని కోరిన ఎమ్మెల్యే శంకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఏటా నిర్వహించుకునే రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండగగా ప్రకటించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. విజయవాడలో సిఎంను కలిసి వేడుకల ప్రాధాన్యతను వివరించారు. అరసవల్లిలో అంగరంగ వైభవంగా జరిగే రథసప్తమి వేడుకలకు తెలుగు రాష్ట్రాల నుంచే గాక పక్కనే ఉన్న ఒడిశా, ఇతర రాష్ట్రాల నుంచీ యాత్రికులు వస్తారని వివరించారు. సిఎం సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

హార్బర్ పనులు వేగవంతం చేయాలి



మ్యాపును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

మండలం లోని బుడగట్లపాలెం వద్ద సుమారు రూ.386 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఫిషింగ్ హార్బర్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. విశ్వ సముద్ర హోల్డింగ్స్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధులతో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావుతో కలిసి గురువారం పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.సాయి ప్రత్యూష, మత్స్యశాఖ ఉప సంచాలకులు శ్రీనివాసరావు, పలు శాఖల అధికారులు, సర్పంచ్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ రఘువర్మ

సమస్యల పరిష్కారానికి కృషి

మెళియాపుట్టి: మండలంలోని పలు పాఠశాలల్లో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘువర్మ పర్యటించారు. గురువారం మండలంలోని పెద్ద లక్ష్మీపురం, కరజాడ, భరణికోట, గొప్పిలి, పెద్దమడి, చాపర, మెళియాపుట్టిలోని ఉన్నత పాఠశాలలు, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ పాఠశాలలను మెళియాపుట్టిలోని జూనియర్ కళాశాలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆశ్రమ పాఠశాలల్లో రెగ్యులర్ ప్రాతిపదికన వార్డెన్, ఎఎన్ఎం పోస్టుల భర్తీ, కొంతమంది సిఆర్‌టిలను అనివార్య కారణాల వలన రెగ్యులర్ చేయకపోవడం, జీతాల సమస్య, ఉపాధ్యాయ మిత్రుల పెండింగ్ బకాయిలపై సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. భవిష్యత్‌లో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం చూపే దిశగా పని చేస్తానన్నారు. వచ్చే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటుతో తనను గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా, మండల నాయకులు కృష్ణమూర్తి, బి.ఢిల్లేశ్వరరావు, ధర్మారావు, అనిల్, చక్రధరి, రవికాంత్, ఢిల్లేశ్వరరావు, కామేశ్వరరావు, హెచ్ఎం ఎం.లక్ష్మీదేవి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


సంతబొమ్మాళి : అధికారులకు సూచనలు చేస్తున్న ప్రత్యేకాధికారి

ప్రజాశక్తి - కవిటి

దానా తుపాను నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ సూచించారు. ఈ మేరకు మండలం రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో నాలుగు మండలాల రెవెన్యూ, ఆర్‌అండ్‌బి, సచివాలయ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. తుపాను ప్రభావం ఒడిశాపై ఎక్కువగా ఉన్నా నియోజకవర్గంలో తీరప్రాంతం ఎక్కువగా ఉండడం, తుపాను తీరం దాటిన తర్వాత తీవ్రమైన వర్షాలు ఉంటాయనే సమాచారం దృష్టిలో ఉంచుకొని అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. అదేవిధంగా మత్స్యకారులు వేటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే సాయంత్రం తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి రత్నాల శ్రీనివాసరావు, అప్పలస్వామి, తహశీల్దార్ మురళీ మోహన్, ఎంపిడిఒ శ్రీనివాస రెడ్డి, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాలం రమేష్, అధికారులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: దాన తుపాను ప్రభావం తీవ్రతపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ బెందాలం అశోక్ అధికారులను ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, ప్రత్యేకాధికారి శ్రీనివాస రెడ్డి, తహశీల్దార్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండల అధికారులు దానా తుపానుపై అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి జె.ఉమామహేశ్వరరావు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తుపాను తీవ్రత బట్టి ప్రజల కొరకు సంతబొమ్మాళి బాలుర వసతి గృహాన్ని పునరావాస కేంద్రంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పంట నష్టాలు జరిగితే గుర్తించడానికి మండలానికి ఒక డ్రోన్ ఏర్పాటు చేశామన్నారు. తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఎంపిడిఒ పి. జయంత్ ప్రసాద్, పంచాయతీరాజ్ జెఇ కె.అంజిత్ కుమార్, ఎంఇఒ చిన్నవాడు, అధికారులు పాల్గొన్నారు.


కవిటి : మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

పాతపట్నం: దానా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ఒడిశా నుంచి వరద తాకిడి వచ్చే అవకాశం ఉన్నందున మండలంలోని కె.గోపాలపురం, హెచ్. గోపాలపురంలో పంచాయతీ ఇఒ వరప్రసాదరావు, సర్పంచ్ ప్రతినిధి శిర్ల జోగారావు, పంచాయతీ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేశారు.

పలాస: దాన తుపాను సమయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ వసంత్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తుపాను ముందస్తు చర్యలో భాగంగా లోతట్టు ప్రాంతమైన అమలాకుడియా, పూర్ణభద్ర గ్రామ ప్రజలకు తగు సూచనలు చేశారు. అలాగే అమలాఖుడియాలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి వర్మి కంపోస్ట్, సెమీ కంపోస్ట్ తయారీ నిమిత్తం తగు సూచనలు చేశారు. ఆలాగే వరాహల గెడ్డ ఫ్లో ఛానల్, బ్రాహ్మణ తర్ల సప్త ప్రాంతను పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాన్నారు. అమలాకుడియా, బ్రాహ్మణ తర్ల గ్రామ సచివాలయాలను ఎంపిడిఒ, విస్తరణాధికారి ఎం. వైకుంఠరావు తనిఖీ చేశారు.


ఇసుక ర్యాంపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఇసుక ర్యాంపు ప్రారంభం

కొత్తూరు: మండలంలోని నివగాం, ఆకులతంపర ఉచిత ఇసుక ర్యాంపులను గురువారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక రాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అక్రమంగా ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో టెక్కలి అర్‌డిఒ కృష్ణారావు, ఎంపిడిఒ నీరజ, టిడిపి నాయకులు మాతల గాంధీ, అగతముడి అరుణ్ కుమార్, కొయిలాపు సంజీవరావు, వి.సుధాకర్, సర్పంచ్‌లు నాగళ్ల అప్పన్న, వి.పోలినాయుడు, సిహెచ్ రాము, డి.చిన్నారావు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్ఐఒ దుర్గారావు

ఆర్ఐఒ కళాశాల తనిఖీ

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారి ప్రగాడ దుర్గారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాల రికార్డులను పరిశీలించారు. ఇప్పటివరకు విద్యార్థులు సాధించిన ప్రగతి నివేదికలను పరిశీలించారు. ఎంపిసి, బైపిసి తరగతులను పర్యవేక్షించి బోధనా పద్ధతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు హెచ్ఎం ఎన్.శోభారాణి, తమ్మినేని ఆనందరావు, రమణ, అప్పలస్వామి, శ్రీనివాస్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

టెక్కలి: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఉప్పాడ ప్రభాస్, చిరంజీవి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై హెచ్ఎం దాసరి నాగభూషణం గురువారం అభినందించారు. ఈ నెల 26 నుంచి 28 వరకు తూర్పుగోదావరి జిల్లా మార్టేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగబోయే బాస్కెట్‌బాల్ పోటీల్లో హాజరు కానున్నారని వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె. రామిరెడ్డి తెలిపారు.

న్యాయవాదులతో సమావేశం

టెక్కలి: డిసెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకునేలా న్యాయవాదులు చర్యలు తీసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్ హరిప్రియ కోరారు. గురువారం కోర్టుహాల్‌లో న్యాయవాదులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన కేసులన్నీ పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద, టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల పోలీస్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తేజేశ్వరరావు

రైతులకు సాగుహక్కు కల్పించాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

నారాయణపురం భూములు సాగుచేస్తున్న రైతులకు సాగుహక్కులు కల్పించాలని విద్యుత్ ఇందన సర్దుబాటు చార్జీల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించు కోవాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు తొలగించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం చిలకపాలెంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరతరాలుగా నారాయణపురం భూములు సాగుచేస్తున్న సాగు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పట్టాలు ఇచ్చి సాగుహక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. నారాయణపురం భూముల్లో అక్రమంగా క్వారీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేసి రైతుల పంటలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూనె, కందిపప్పు, ఉల్లిపాయలు, టమోటా వంటి నిత్యవసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేని విధంగా ఆకాశాన్నంటాయన్నారు. గత ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు అక్రమంగా బిగించిన స్మార్ట్ మీటర్లు తొలగిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానం చేశారని ఆ మేరకు వాటిని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పి. కవిలేశ్వరరావు, తోనంగి. నందోడు, పి.చంద్రరావు, జి.కృష్ణారావు, కోరాడ అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించాలి

కొత్తూరు: మండలంలోని పారాపురంలో దళితుల శ్మశాన వాటిక రహదారి సమస్యను ప్రభుత్వం పరిష్కారం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్, దళిత నాయకులు కింజరాపు సింహచలం, గర్భాక రామారావు, కొర్రాయి రవి, యందవ రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పారాపురం అంబేద్కర్ విగ్రహం ఎదుట వారు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి దళితుల సమస్యలు పెండింగులో ఉన్నాయని, మరణించిన వ్యక్తి దహన సంస్కారాల కోసం శ్మశానవాటికకు తీసుకువెళ్లటానికి నేటికీ రహదారి లేదని, అనేకమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు తెలియజేసినా నేటికీ రహదారి సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా దళితుల దీర్ఘకాలిక సమస్యగా ఉన్న శ్మశాన వాటికకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, లేకుంటే పోరుబాట పడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో దళితులు గోపి, సింహచలం, శంకర్, రామారావు, రామకృష్ణ, శ్రీను, రమణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిర్ల ప్రసాద్

ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు కావాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వచ్చే నెల 6 లోపు యూనివర్సిటీ, కళాశాలలు, ఉన్నత పాఠశాలల్లోని అధ్యాపకులు, ఉపాధ్యాయులంతా ఓటర్లు గా నమోదు కావాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ కిషోర్‌కుమార్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపునిచ్చారు. ఆన్‌లైన్‌లో గానీ, ఆఫ్‌లైన్‌లో గానీ ఫారం 19 ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గురువారం యుటిఎఫ్ కార్యాలయంలో సంఘ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు హాజరై మాట్లాడుతూ ఫారం 19 నకు సంబంధించి 2018 నవంబర్ నుంచి 24 నవంబర్ 1 నాటికి ఆరు సంవత్సరాల సర్వీస్ కాలంలో కనీసం మూడేళ్ల సర్వీసును ఉన్నత పాఠశాలలో కళాశాలల్లో పని చేసిన అధ్యాపకులు ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు అర్హులన్నారు. ఫారం 19 తో పాటు పాస్పోర్ట్ సైజ్ ఫోటో, డిడిఓ సంతకం చేసిన సర్వీస్ సర్టిఫికేట్ ,ఆధార్ జిరాక్స్ కచ్చితంగా అవసరమని, వాటర్ కార్డు వివరాలు ఉంటే వాటిని కూడా నమోదు చేయాలని తెలిపారు.

ఓటర్ల నమోదుకు యుటిఎఫ్ నాయకులు క్షేత్ర స్థాయిలో పూర్తి సహకారాన్ని అందిస్తారని వివరించారు. ఓటర్లుగా నమోదు చేసుకుంటున్న వారు యుటిఎఫ్ సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో విద్యారంగ పరిరక్షణ కోసం ఉపాధ్యాయుల సంక్షేమం కోసం శాసనమండలిలో సాధారణ ఉపాధ్యాయుని గొంతుకగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉండాలన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ ఓటును నమోదు చేయించుకొని యుటిఎఫ్ బలపరిచిన ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పి డి ఎఫ్) అభ్యర్థిని గెలిపించేందుకు కషి చేయాలన్నారు. ఈ సమావేశానికి జిల్లా కార్యదర్శి హనుమంతు అన్నాజీరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో జిల్లా కోశాధికారి బి రవి కుమార్, జిల్లా కార్యదర్శి గొంటి సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ ఎండ ఉమాశంకర్, శ్రీకాకుళం, గార, లావేరు, ఎచ్చెర్ల, జి.సిగడం మండల యుటిఎఫ్ నాయకులు సురేష్ కుమార్, చిన్నారావు, ఆర్ త్రినాథరావు, మహేష్, శ్రీనివాస్, మురళీమోహన్, బి.రమణ, బి.శ్యాం, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న కిషోర్ కుమార్

టెక్కలి: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఉపాధ్యాయులు తమ ఓటుహక్కు నమోదుకు దరఖాస్తులపై శ్రద్ధ చూపాలని యుటిఎఫ్ సీనియర్ నాయకులు పాలవలస ధర్మారావు, జిల్లా సహధ్యక్షులు కురమాన దాలయ్య కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. నవంబర్ 6లోగా నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో తమ్మినేని వైకుంఠరావు, గణపతిరావు, కుమారస్వామి పాల్గొన్నారు.

మండల సమావేశంలో ప్రోటోకాల్ రగడ



మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రతిపక్ష ఎంపిపి, సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, వైస్ ఎంపిపిలకు ఇవ్వాల్సిన గౌరవం, ప్రోటోకాల్‌పై మండల సర్వ సభ్య సమావేశంలో రచ్చజరిగింది. బుధవారం ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయశాఖపై సమీక్ష అనంతరం మండల ప్రత్యేక ఆహ్వానితుడు మాట్లాడారు. సిసి రహదారుల పనులకు మేము తీర్మాణాలిస్తే మాకు చెప్పకుండా శంకుస్థాపనలు చేసి ప్రోటోకాల్ ఉల్లంఘించడమేంటని నిలదీశారు. గత సమావేశంలో ప్రోటోకాల్ ఉల్లంఘించే అధికారులపై చర్యలు తీసుకోవాలని తీర్మాణం చేస్తే దానిని ఎందుకు అమలు చేయలేదని ఎంపిడిఒ ఎన్. రమేష్ నాయుడును నిలదీశారు. పాతటెక్కలి దళిత సర్పంచ్ కుర్చీని చెత్త బండిలో వేసి ఇంటికి పంపిన కార్యదర్శిపై ఏం చర్యలు తీసుకున్నారని, చర్యలు తీసుకోకుంటే తాను కలెక్టర్, మానవహక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తానని దళిత సర్పంచ్ టి.సుశీల ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. తాము అభివృద్ధికి అడ్డుకాదని సర్పంచ్, ఎంపిటిసి, ఇతర ప్రతినిధులకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకపోతే పంచాయతీ తీర్మానాలు సైతం పక్కన పెడతామని ఎంపిపి స్పష్టం చేశారు. ఇటీవల ప్రభుత్వం ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో మండలంలో పలు గ్రామాల్లో సిసి రహదారులకు ఎమ్మెల్యే గౌతు శిరీష, కూటమి నాయకులు శంకుస్థాపనలు చేశారు. ఆ సమయంలో పల్లిసారథిలో ఎంపిపి, జెడ్‌పిటిసి పేర్లు శిలాఫలకంపై లేకపోవడం. ఇతర చోట్ల సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు ప్రోటోకాల్ నిబంధనల మేరకు గౌరవం ఇవ్వక వివక్షత చూపడంతో ఎంపిపి నిలదీశారు. వైసిపి ప్రభుత్వంలో తామెప్పుడూ ప్రోటోకాల్ ఉల్లంఘనలు చేయలేదని చెప్పడంతో టిడిపి నాయకులు దువ్వాడ హేమబాబు చౌదరి కలుగుచేసుకుని గత ప్రభుత్వంలో చినవంక పంచాయతీలో సచివాలయ ప్రారంభోత్సవానికి ప్రోటోకాల్ ఉల్లంఘనలు చేశారని గుర్తు చేశారు. ఎంపిడిఒ రమేష్‌నాయుడు కలుగజేసుకుని ఇక నుంచి ప్రోటోకాల్ ఉల్లంఘనలు ఉండవని, అందుకు కలెక్టర్, జెడ్‌పి సిఇఒ ఆదేశించారని హామీఇచ్చారు. అనంతరం ఉపాధిహామీ, ఇరిగేషన్, అటవీ, స్త్రీ శిశు సంక్షేమం, వెలుగు తదితర శాఖలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు శ్రావణి, వంక రాజు, మండల విఫ్ తిర్రి గుణ, మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.


లావేరు : రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సాయి ప్రత్యూష

గ్రామసభల ద్వారా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- లావేరు

రీసర్వేలో భూముల తప్పు, ఒప్పులు, సవరణ సమస్యలు గ్రామసభల ద్వారా పరిష్కరించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఆర్‌డిఒ సాయి ప్రత్యూష అన్నారు. గురువారం సిగురు కొత్తపల్లిలో జరుగుతున్న గ్రామసభను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వే జరిగిన భూములకు విస్తర్ణంలో హెచ్చుతగ్గులు, జాయింట్ ఎల్‌పిఎం నెంబర్లు, ఆధార్ నెంబర్ తప్పులు, ఉమ్మడి భూముల్లో వ్యత్యాసం వంటి సమస్యలుంటే ఈ సభల్లో వినతిపత్రాలు అందజేసి సమస్యలు పరిష్కారం చేసుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బంది సదస్సులను బాధ్యతా యుతంగా నిర్వహించాలన్నారు. ఈ గ్రామసభలో 41 వినతులు వచ్చాయి. ఈ సదస్సులో తహశీల్దార్ ఎన్ని జోగారావు, రీసర్వే డిటి ఎన్.తిరుపతిరావు, ఆర్ఐ రాపర్తి అప్పల రాజు, సర్వేయర్ శ్రీధర్ రెడ్డి, విఆర్ఒ సత్యవతి, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


పొందూరు : గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్, వార్డు సభ్యులు

మెళియాపుట్టి: రెవెన్యూ సదస్సులు వినియోగించుకోవాలని తహశీల్దార్ బడే పాపారావు సూచించారు. మండలంలోని చొంపాపురం, పరశురాంపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జగన్ మోహనరావు, వైస్ ఎంపిపి ఎస్ ఆదినాయుడు, సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, కామాక్షి ప్రసాద్ బ్రహ్మ, చాపర మాధవరావు, కార్యదర్శి శివాజీ, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పోలాకి: భూ సర్వేలో ఉన్న సమస్యలు పరిష్కారం కొరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ ఎం.సురేష్ కుమార్ సూచించారు. గుల్లవానిపేట, రాజపురం, రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలాస: మండలం వీరభద్రపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 18 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి కొర్ల మురళీకృష్ణ చౌదరి, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సునంద, మండల సర్వేర్ గిరి తదితరులు పాల్గొన్నారు.



పలాస : సదస్సులో మాట్లాడుతున్న తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి

పొందూరు: మండలంలోని రాపాకలో సర్పంచ్ కొంచాడ వనజ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.శ్రీనివాసరావు, వార్డుసభ్యులు సురేష్, సింహాచలం, సన్యాసిరావు, తవుడు, కోటి పాల్గొన్నారు.


మెళియాపుట్టి : మాట్లాడుతున్న తహశీల్దార్ పాపారావు

హామీల అమలుపై చర్చకు సిద్ధమా!

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ప్రజాశక్తి- పోలాకి

వైసిపి ఐదేళ్ల పాలనలో అమలు చేసిన హామీలను, తమ ప్రభుత్వం నాలుగు నెలల్లో అమలు చేసిన హామీలపై ప్రజల్లో చర్చకు సిద్ధమా అని మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డికి ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సవాల్ విసిరారు. గురువారం ఈదులవలస జంక్షన్‌లో ఓ కళ్యాణ మండపంలో విలేకరులతో మాట్లాడారు. టిడిపి నాలుగు నెలల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేదనే విమర్శలను తిప్పికొట్టారు. వైసిపి 2019 ఎన్నికల్లో సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామని అధికారంలోకి వచ్చాక విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేయడమే కాకుండా అధిక ధరలు పెంచారన్నారు. ఫించన్లు పెంచడానికి ఐదేళ్లు పట్టిందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేయలేదని, అభివృద్ధి తుంగలోకి తొక్కారన్నారు. సిఎంగా చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన నాలుగు నెలలకే ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథాకాలు అమలు చేస్తున్నారన్నారు. పింఛను పెంపు, ఉచిత ఇసుక, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, దీపావళికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను శతశాతం అమలు చేసి తీరుతామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, మాజీ ఎంపిపి తమ్మినేని భూషణరావు, వైసిపి నాయకులు బైరి భాస్కరరావు, రోణంకి కృష్ణంనాయుడు, రమేష్, రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపిటిసి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి



వృద్ధుడు ఆత్మహత్య

కోటబొమ్మాళి: మండలం చిట్టేవలస పంచాయతీ భగీరథపురానికి చెందిన మెట్ట అప్పారావు (71) పురుగుల మందు తాగి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే అప్పారావు ఇంటిలో గొడవపడి బుధవారం సాయంత్రం పురుగుల మందు పట్టుకొని కొండలవైపు వెళ్లి ఓ చెట్టుకింద పురుగుల మందు తాగాడు. సమీపంలో ఉన్న గ్రామస్తులు చూసి ఇంటికి తీసుకువచ్చి సబ్బు నీళ్ల తాగించినా అప్పటికే అపస్మారక స్థితికి వెళ్లిపోవటంతో హుటాహుటిన శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అప్పారావు అక్కడ చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ మేరకు స్థానిక ఎస్ఐ సత్యన్నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతునికి భార్య శాంతమ్మ, వివాహితులైన ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.


అప్పారావు (ఫైల్)

యువకుడు బలవన్మరణం

రణస్థలం రూరల్: మండలంలోని బండిపాలెంకు చెందిన అమరా అయ్యప్ప (34) ఈ నెల 21న వ్యక్తిగత కారణాలతో పురుగుల మందు తాగాడు. జిల్లా కేంద్రంలో సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు. భార్య దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. అయ్యప్పకు ఇద్దరు పిల్లలు కామేశ్వరి, మనోజ్ కుమార్ ఉన్నారు.


అయ్యప్ప (ఫైల్)

మహిళ ఆత్మహత్య

నందిగాం: మండలం నౌగాం గ్రామానికి చెందిన కొన్ని సావిత్రి (35) ఇంటిలో ఎవరు లేని సమయంలో గురువారం ఉదయం గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో ఇంటిలో పడి ఉండడంతో ఇంటికివచ్చిన భర్త తవుడు చూసి అపస్మారక స్థితిలో ఉన్న భార్య సావిత్రిని చూసి కుటుంబసభ్యులతో కలిసి టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సావిత్రి మృతి చెందింది. ఈమెకు కుమారుడు గిరి ఉన్నారు. భర్త పోలీసుల వివరాల మేరకు గతంలో సావిత్రి గర్భసంచి ఆపరేషన్ చేయించుకున్నా ఆమె తరచూ అనారోగ్యంతో బాధపడుతుండేదని, అనారోగ్యాన్ని తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపారు. మృతురాలి సోదరుడు మొఖలింగం ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో మహిళ మృతి

నందిగాం: మండలం శివరాంపురం పంచాయతీ కోటిపల్లి గ్రామానికి చెందిన కోనారి జయలక్ష్మి (24) సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాముకాటుకు గురై అస్వస్థతకు గురైంది. దీంతో గుర్తించిన భర్త సోమేశ్వరరావు హుటాహుటిన టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమిం చడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలి ంచారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.


జయలక్ష్మి (ఫైల్)

వ్యక్తిపై దాడి

బూర్జ : ఓ మహిళ ఇంటికి రమ్మని చెప్పి గురువారం వ్యక్తిపై దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు విజయనగరం జిల్లా డెంకాడకు చెందిన కలవకోట ప్రసాద్ విజయనగరంలోని విజయలక్ష్మి ట్రాన్స్‌ఫోర్టలో పనిచేస్తున్నాడని, అయితే ఈయనకు బూర్జ మండలం ఒవిపేటకు చెందిన నక్క రమణమ్మతో 9 నెలలుగా పరిచయం ఏర్పడిందని చెప్పారు. ఈ ఏడాది మార్చి నుంచి మే నెల వరకు ఆమదాలవలసలోని పూజారి పేటలో ఒక ఇల్లు తీసుకొని కలిసి నివాసం ఉన్నామని ప్రసాద్ తెలిపారు. అయితే తన అవసరం కోసం డబ్బులతో ఇంటికి సామాన్లు, ఒక స్కూటీ కొన్నానని, అలాగే తన సొంత ఇంటికి పెయింటింగ్‌లు వేశానని తెలిపారు. గత నాలుగు నెలలుగా తమ మధ్య తగాదాలు రావడంతో 15 రోజుల క్రితం రమణమ్మ ఒవిపేటలోని తన సొంత ఇంటికి వెళ్లిపోయిందని తెలిపారు. బుధవారం రమణమ్మ ఆమదాలవలస వస్తే మాట్లాడదాం అని ఫోన్ చేసిందని అయితే మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎదురుచూడగా ఆమె రాకపోవడంతో ఒవిపేటలోని తన ఇంటికి వెళ్లి ప్రసాద్ పిలిచాడు. ఇంటి లోపల నుంచి వచ్చిన రమణమ్మ దుర్భాషలాడుతూ బాత్రూమ్ కడిగే యాసిడ్‌ను తనపై విసిరిందని ప్రసాద్ తెలిపారు. దీంతో తన మొఖానికి, కాళ్లకు గాయాలయ్యాయని, దాడికి పాల్పడిన రమణమ్మపై చర్యలు తీసుకోవాలని ప్రసాదు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

పొందూరు: మండలంలోని సింగూరు గ్రామ సమీపంలో బుధవారం అర్ధరాత్రి పేకాట శిబిరంపై ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో దాడిచేసి 10 మంది జూదరులను అరెస్టు చేశారు. సింగూరు గ్రామ సమీపంలోని నాగావళి నది ఒడ్డున జూదం ఆడుతున్నట్లు ముందుస్తుగా వచ్చిన సమాచారం మేరకు దాడి జరిపినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. పట్టుబడిన జూదరుల వద్ద నుంచి రూ.1,50,520 నగదు, తొమ్మిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా : పది మందికి గాయాలు

పలాస: మండలం కంబిరిగాం జంక్షన్ జాతీయరహదారి సమీపంలో గురువారం ఆటోబోల్తా పడిన సంఘటనలో డ్రైవరుతో సహా మొత్తం పది మందికి గాయాలయ్యాయి. మండలం పెద్ద నారాయణపురానికి చెందిన మహిళలు జీడి పిక్కల పరిశ్రమలో పని చేసేందుకు పలాసకు ఆటోలో వెళుండగా కంబిరిగాం జంక్షన్ వద్ద ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఆటోబోల్తా పడింది. దీంతో మండలం పెద్దనారాయణపురానికి చెందిన చింతల పార్వతికి తీవ్ర గాయాలుకాగా సుశీల, జమున, అన్నపూర్ణ, పార్వతి, తులసమ్మ, జి.లక్ష్మి, సిహెచ్.వనజాక్షితో పాటు డ్రైవరు ఎ.నాగేశ్వరరావుకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటన జరిగిన వెంటనే హైవే అంబులెన్స్‌లో క్షతగాత్రులను పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పార్వతి పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ పోలీసులు తెలిపారు.


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ఘనంగా ఐ.రా.స ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ మహిళా కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం, పర్యాటక శాఖ సంయుక్తంగా గురువారం ఐక్యరాజ్యసమితి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగాకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ .కె.సూర్యచంద్రరావు హాజరై మాట్లాడుతూ అంతర్జాతీయ చట్టం, భద్రత, ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి, మానవహక్కుల సమిష్టి కృషి చేసేందుకు ప్రపంచ దేశాలు ఏర్పాటు చేసుకున్న ఒడంబడికే ఐక్యరాజ్యసమితి ఏర్పాటుకు దోహదపడిందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. శంకరనారాయణ, అధ్యాపకులు సిహెచ్ కృష్ణారావు, చరిత్ర టూరిజం శాఖాధిపతి డాక్టర్ ఎన్.చిన్నారావు, ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ ఎస్. పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి, డాక్టర్ కె.ప్రభాకర్, ఎస్.రుద్రమరాణి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న సూర్యచంద్రరావు

టెక్కలి: ప్రపంచ దేశాల్లో ఐక్యతని కల్పిస్తు దేశాల మధ్య సమన్వయాన్ని చేసే ఐక్యరాజ్య సమితి ఆవశ్యకత, వాటి పనితీరు వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన అవసరమని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ అన్నారు. కళాశాల ఆవరణలో గురువారం ఐక్యరాజ్య సమితి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్య సమితి ప్రపంచ శాంతి స్థాపనలో దాని పాత్ర అనే అంశంపై వివరించారు. రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విభాగాధిపతి టి.త్రినాథరావు, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ జగన్నాథ్ బిసాయ్, పి.వి.సత్యన్నారాయణ, డాక్టర్ ఎస్.ధర్మారావు, కె.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



సిఐకు వినతిపత్రం అందజేస్తున్న ఎఐవైఎఫ్ నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి- పలాస

పలాసలో ఇటీవల అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు యువకులను కఠినంగా శిక్షించాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు గోరు వాసుదేవరావు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో గురువారం కాశీబుగ్గ సిఐ డి.మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస, కాశీబుగ్గ జంట పట్టణాల్లో గంజాయి, మద్యం రోజురోజుకు అధికమవుతుందన్నారు. విచ్చలవిడిగా గంజాయి అమ్మకాలు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి నిషేధించడంలో ఎన్‌డిఎ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పోలీసులు నిఘా వ్యవస్థ మరింత పెంచి ఇలాంటి దుర్ఘటన భవిష్యత్‌లో పునారావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే బాలికలపై అత్యాచారానికి పాల్పడిన వారికి శిక్షించే క్రమంలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా నిఘా వ్యవస్థ మరింత పెంచి యువకులను, విద్యార్థులను కాపాడాలని కోరారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త అనుష

సమగ్ర యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వ్యవసాయంలో సమగ్ర యాజమాన్య పద్ధతుల నిర్వహణపై రైతు సేవా కేంద్రాల బాధ్యులకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పలాస డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.వి.మధు ఆధ్వర్యంలో అనంతగిరి రైతు సేవా కేంద్రంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వజ్రపుకొత్తూరు, పలాస, మందస, మెళియాపుట్టి మండలాల్లో వ్యవసాయ సహాయకులకు వ్యవసాయ ఆధునిక పద్ధతులు, పంటల యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ అనుషా, డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ వరి, అపరాలు, వేరుశెనగ, నువ్వులు, కట్టెజనుము పంటల వ్యవసాయ పద్ధతులు, విత్తనశుద్ధి, కాలిబాటలు తీయడం, సమగ్ర సస్యరక్షణ, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, వివిధ పంటలను ఆశించు చీడపీడలు, వరిలో దోమ పోటు, అగ్గితెగులు, పోషక లోపాలు నివారించుటకు ఆధునిక యాజమాన్య పద్ధతులపై శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు వెంకటరావు, కీరవాణి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ భవనంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రం

ప్రభుత్వ భవనంలోకి అంగన్వాడీ కేంద్రం

ప్రజాశక్తి- పొందూరు

మండలం కృష్ణాపురంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవతో అంగన్వాడీ కేంద్రాన్ని ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనంలోకి తరలించినట్లు సర్పంచ్ అంబల్ల లక్ష్మి తెలిపారు. ఇటీవల పల్లెపండుగ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం శిధిలావస్థలో ఉన్న రేకులషెడ్డులో నిర్వహిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్తులు ఆయనకు తెలిపారు. గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాన్ని పరిశీలించి అందులోకి మార్చుకోవాలని సూచించారని, ఆయన సూచనలు మేరకు అంగన్వాడీ కేంద్రాన్ని ఆ భవనంలోకి తరలించినట్లు ఆమె పేర్కొన్నారు. గ్రామంలో రేకుల షెడ్డులో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనంలోకి మార్చడంపై గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, గ్రామస్తులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



నగదును అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

చదువుకు పేదరికం అడ్డు కాదు

ప్రజాశక్తి- కవిటి

చదువుకు పేదరికం అడ్డుకాకూడదన్న మహోన్నత లక్ష్యంతో శ్రీ చింతామణి ట్రస్ట్ పేరుతో (ఇందిరా దేవి - చింతామణి కుమార్ ఆర్థిక సహాయంతో) ఎంతోమందికి చేస్తున్న విద్యాదానం నభూతో నభవిష్యత్ అని సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాలం రమేష్ అన్నారు. కవిటిలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న మద్ది మీనా కుమారుడైన మద్ది జానకిరావును దత్తత తీసుకున్న ట్రస్ట్ అతని ఇంజినీరింగ్ విద్య మూడో విడత ఫీజు నిమిత్తం విద్యార్థి తల్లికి గురువారం రూ.40 వేలు అందించింది. అదే విధంగా కవిటి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని సూరకాసుల హాసిని ఇంటర్మీడియట్ చదువు నిమిత్తం రూ.25 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో పాండవ చంద్రశేఖర్, ఆరింగి మధు, పొల్లాయి లక్ష్మణమూర్తి, బెందాలం వెంకటేశ్వరరావు, బెందాలం కామరాజు, ఆరింగి తివిక్రమరావు, బెందాలం రమణమూర్తి, పొల్లాయి ఉమా మహేష్, బావన రవి, మొగలిపురి సీతారాం, మొర్రి గోపి మొగలిపురి నాగేశ్వరరావు, పొల్లాయి వాసు, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల హర్షం

కోటబొమ్మాళి: టిడిపి ప్రభుత్వం నాయీబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయంపై జిల్లా నాయీబ్రాహ్మణుల సంఘం ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులకు ఇచ్చిన హామీలో భాగంగా ప్రభుత్వం వాటిని దశలవారీగా హామీలు అమలు చేయటంతో ఎంతో ఆనందంగా ఉందని, దీంతో తమకు న్యాయం జరుగుతుందన్నారు. దేవాలయ పాలక మండలిలో సభ్యత్వం కల్పించటంతో మా ఉన్నత స్థితికి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ, కనకరాజు, నరేష్, శంకరరావు, బొమ్మాళి కృష్ణారావు, శిమ్మయ్య, అప్పారావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న నాగరాజు



మొక్కలు నాటుతున్న బాలమాన్ సింగ్

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం డ్రైవర్సు వెల్ఫేర్ అసోషియేషన్ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని పిఎస్ఎన్ఎం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి డిపిఆర్ఒ బాలమాన్ సింగ్ హాజరయ్యారు. పచ్చదానాన్ని పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చుని, డ్రైవర్సు అషోషియేషన్ ఆధ్వర్యాన మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ సేవలు విస్తృత పరచాలన్నారు. కార్యక్రమంలో జోగినాయుడితో పాటు వైటిహెచ్ జిం నిర్వాహకులు జి. చంద్ర మౌళి, జుంబా డాన్స్ ఫౌండర్ బి.దేవిప్రసాద్, కళాశాల హెచ్ఎం బలివాడ భాస్కరరావు, డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాడ.గణపతి, పమ్మిన నరేష్, కిల్లి రాము, బోనుల శంకరరావు, నాగరాజు, మురళి, రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఖాదీ వస్త్రాలను పరిశీలిస్తున్న మంత్రి సతీమణి సింధు

ఖాదీ కార్మికుల నైపుణ్యం ప్రశంసనీయం

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు ఖాదీ వస్త్రాల తయారీలో నేత కార్మికుల నైపుణ్యం ప్రశంసనీయమైనదని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు సతీమణి సింధు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎఎఫ్‌కెకె సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఖాదీ వస్త్రాల తయారీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని ఆలయం ప్రాంగణంలో మొక్కలను నాటారు. ఈమెతో పాటు కుటుంబ సభ్యులు సుజాత, శ్యామల, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, ఇఒ. మోహన్‌బాబు, టిడిపి నాయకులు దండా రవి, బాల తదితరులున్నారు.




ఆర్థికసాయం అందజేస్తున్న ఎస్‌జిఎఫ్ సభ్యులు

చిన్నారికి ఎస్‌జిఎఫ్ అండ

ప్రజాశక్తి- కవిటి

మండలం నెలవంక గ్రామానికి చెందిన చిట్టికి ఎస్‌జిఎఫ్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. చిన్నారి తల్లి కమల ఇటీవల అనారోగ్యానికి గురై మరణించగా, తండ్రి మతిస్థిమితం లేని వ్యక్తి. దీంతో ఒంటరైన చిన్నారి పరిస్థితి తెలుసుకున్న సంస్థ సభ్యులు గురువారం గ్రామానికి చేరుకుని పాప బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం తమవంతుగా రూ.10వేలు అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ మాట్లాడుతూ దిక్కుతోచని స్థితిలో ఉన్న చిన్నారిని దాతలు ఉదారంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆధునిక పద్ధతులు పాటించాలి

నౌపడ : రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి ఉత్తమ ఫలితాలను సాధించే ప్రయత్నం చేయాలని మండల వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు రైతులకు అవగాహన కల్పించారు. సంతబొమ్మాళి మండలం యామాలపేటలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రతినిధి ముదిలి సంజీవ్ కుమార్, ఉద్యాన సహాయకురాలు మంచాల లలిత, కార్యదర్శి బమ్మిడి కేశవరావు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

సంఘాల పనితీరు పరిశీలన

కంచిలి: గ్రామాల్లోని స్వయంశక్తి సంఘాల పనితీరును స్థానిక ఎపిఎం ఎస్.ప్రసాదరావు గురువారం స్వయంగా పరిశీలించారు. మండలంలోని జాడపూడిలో స్వయంశక్తి సంఘాల సభ్యుల ఇళ్లకు వెళ్లి పుస్తకాలు పరిశీలించి, సభ్యులతో మాట్లాడారు. సంఘాల అభివృద్ధికి నిర్దేశించిన పంచసూత్రాల అమలుపై ఆరా తీశారు. సంఘ సమావేశాలు, బ్యాంకు లింకేజీ, అప్పులు తిరిగి చెల్లించడం, పుస్తక నిర్వహణ అంశాలపై సభ్యులను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల బలోపేతం, అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో విఒఎలు పార్వతి, మోహినితో పాటు మహిళ సంఘసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదులో ప్రథమ స్థానంలో ఉండాలి

ప్రజాశక్తి- పోలాకి

టిడిపి సభ్యత్వ నమోదులో నరసన్నపేట నియోజకవర్గం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. గురువారం ఈదులవలస జిఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పార్టీ నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుంచి టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. తెలుగు దేశం పార్టీ పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల నుంచి ఆవిర్భవించిందన్నారు. ప్రతి ఒక్కరు ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ సభ్యత్వ నమోదు వలన సాధారణ మరణానికి రూ.10 వేలు మట్టి ఖర్చుకు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు బీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సోషల్ మీడియా కన్వీనర్ అర్చన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో యువత సహకరించాలన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ఎం.వెంకట అప్పలనాయుడు, మాజీ ఎంపిపి తమ్మినేని భూషణరావు, సోషల్‌మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, టిడిపి నాయకులు బైరి భాస్కరరావు, రోణంకి కృష్ణం నాయుడు, కె.రమేష్, ఎల్.రాంబాబు, సింహాచలం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడుతున్న అర్చన

ఉద్యోగ కల్పన నమోదు డ్రైవ్



మాట్లాడుతున్న సూర్యచంద్రరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం కళాశాల రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.సూర్య సునీత అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ .కె.సూర్యచంద్రరావు హాజరై మాట్లాడుతూ విద్యార్థినులకు డిగ్రీ పూర్తి చేసిన వెంటనే ఉద్యోగం సంపాదించు కోవడానికి ఈరిజిస్ట్రేషన్ తప్పనిసరన్నారు. జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పదవ తరగతి పూర్తయిన వెంటనే ఎంప్లాయ్‌మెంట్ కోసం 'స్టేట్ పోర్టల్' 'నేషనల్ కెరీర్ ఫర్ సర్వీసెస్' మొదలైన పోర్టల్లో పేరును నమోదు చేసు కోవచ్చన్నారు. అలాగే మూడేళ్ల కొక సారి రెన్యువల్ చేసుకోవచ్చని జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్ వై.రవీంద్ర తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, ఎం.ఎన్ పాఠక్ (వై.పి), రసాయన శాస్త్ర అధ్యాపకులు ఎం. రోహిణి, సిహెచ్ చాందిని, ఎస్.గీత, పి కీర్తి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర నారాయణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్ కృష్ణారావు, ఐక్యు ఎసి కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజ నిర్మాణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రపంచ పోలియో దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ శ్రీకాకుళం ఆధ్వర్యాన పోలియో నిర్మూలనపై అవగాహన, విరాళాల సేకరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు అధ్యక్షులు ముని శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు క్లబ్ సన్నాహక సమావేశాన్ని గురువారం నగరంలోని ప్రైవేటు భవనంలో నిర్వహించారు. అనంతరం నగరంలో పోలియోపై అవగహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ 1979లో పోలియో నిర్మూలనకు పోరాటం ప్రారంభించిందని, నాటి నుంచి నేటి వరకు నిర్విరామమంగా కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ సెక్రటరీ డి.శివశంకర్, క్లబ్ కార్యదర్శి దూసి సంతోష్, కోశాధికారి పసగాడ సూర్య, పబ్లిక్ ఇమేజ్ చైర్మన్ ఎంఆర్‌కె దాస్, డాక్టర్ మంత్రి వెంకటస్వామి, ప్రతినిధులు డాక్టర్ బమ్మిడి సందీప్, వారణాసి సందీప్, ఇప్పిలి వెంకన్నశెట్టి, కిల్లాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వరి తెగుళ్లతో రైతుల ఆందోళన



తెగుళ్ల నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతు

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం, లావేరు మండలాల్లో వందలాది ఎకరాల వరికి కాండం కుళ్ల తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా రణస్థలం మండలంలోని సీతంవలస, గొల్లపేట, లావేరు మండలంలోని పిడుగుపాలెం, లావేటిపాలెం, లావేరు తదితర ప్రాంతాల్లో వరిలో కాండం కుళ్ల తెగులు చాలా ఎక్కువగా కనిపిస్తుంది. రైతులు నివారణా చర్యలకు మందులు పిచికారీ చేస్తున్నా తెగులు నివారణ జరగడం లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు సలహాలను ఇవ్వాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఆకు తొడిమ పైభాగంపై చిన్నచిన్న, అపసవ్యమైన నల్లటి మచ్చలు ఏర్పడుతున్నాయని, ఈ నష్టం విస్తరించి ఆకుల మధ్యన కాండం భాగాలు కుళ్ళిపోయి కుప్పకూలిపోతున్నాయని, పడిపోవడం, కంకులు పాలు పోసుకోకపోవడం, ధాన్యం తెల్లని రంగులోకి మారడం, పిలకలు చనిపోవడం జరుగుతుందని పేర్కొన్నారు. తెగులు సోకి బోలుగా మారిన కాండం లోపల, ముదురు బూడిద రంగు మైసీలియం ఏర్పడుతుందని రైతులు తెలిపారు. వరిలో కాండం కుళ్ల తెగులు నివారణకు వ్యవసాయ అధికారులు తక్షణమే స్పందించి వరి పొలాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర శ్రీకాకుళం ఆధ్వర్యంలో మండలంలోని నైరా ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ కళాశాలలో సెమినార్ హాల్‌లో ఏక్ పెడ్ మా కే నామ్ తల్లి పేరున ఒక మొక్క నాటాలి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అగ్రికల్చరల్ కళాశాల ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. వి.శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అమ్మ పేరున ఒక మొక్కను నాటాలని, ఆ మొక్కను అమ్మను చూసుకున్నట్లు జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన కార్యక్రమం ద్వారా ప్రతిఒక్కరూ తమ తల్లులను గౌరవించేలా ఒక మొక్క నాటాలన్నారు. కార్యక్రమంలో నైరా అగ్రికల్చర్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ అధికారి డా. ఎస్.గోవిందరావు, హెడ్ ప్రొఫెసర్స్ డా పి. గురుమూర్తి, డా. జి.జోగినాయుడు, డా. వై. రాజశేఖర్, నెహ్రూ యువ కేంద్ర గణాంకాధికారి శ్రీనివాసరావు, మూలపేట వివేకానంద యువజన సేవా సంఘం కార్యదర్శి గుజ్జల ఉమామహేశ్వరరావు, శాంతి స్వరూప్ యువజన సేవా సంఘం కార్యదర్శి కళింగపట్నం రాము పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ప్రొఫెసర్ శ్రీనివాసరావు, అధికారులు

కీర్తిరాయి చెరువును అభివృద్ధి చేయాలి



చెరువును పరిశీలిస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పాత జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కీర్తిరాయి చెరువు దీర్ఘకాలంగా వాడుకలో లేకపోవడం వలన చెత్త, చెదారం చేరి దుర్గంధ భరితంగా తయారైందని జనసేన పలాస సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు అన్నారు. కాశీబుగ్గ కీర్తిరాయి చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం కీర్తిరాయి చెరువు ప్రధాన నీటి వనరుగా ఉండేదని, చెరువులో ప్రజలు స్నానాలతో పాటు చేపల పెంపకం కూడా చేపట్టే వారిని తెలిపారు. పూర్తిగా కలుషితమైన చెరువు వలన పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న వెంకటేశ్వర కాలనీ, అప్పయ్య దొర కాలనీ వాసులకు వ్యాధులు సంక్రమించి అనారోగ్యం పాలవుతున్నారన్నారు. పలాస ఎర్ర చెరువుతో పాటు కీర్తిరాయి చెరువు పూడికలు తీసి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి పర్యాటకపరంగా అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కోన కృష్ణారావు, దువ్వాడ వంశీకృష్ణ చౌదరి, నందిగాం ధర్మారావు, లక్ష్మీనారాయణ, ప్రకాష్ పాల్గొన్నారు.



మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలు

విద్యార్థులకు పోటీలు

పొందూరు: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని వావిలపల్లిపేట వద్ద ఎపి మోడల్‌స్కూల్, లోలుగు కెజిబివి విద్యార్థులకు గురువారం ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో వ్యాసరచన, డిబెట్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల నియంత్రణలో యువత పాత్ర అనే అంశంపై ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు హెచ్.ప్రభాకర్, ఆర్.సౌమ్య, ఉపాధ్యాయులు, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

లాభసాటి వ్యవసాయానికి కృషి

పలాస: మహిళ రైతు సంఘాలు లాభసాటి వ్యవసాయ సాగుకు కృషి చేయాలని జిల్లా మహిళా రైతు సంఘం ఎపిఎం కె.ఈశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మహిళా రైతు సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి పరిస్థితుల్లో సేంద్రియ వ్యవసాయం ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. మహిళా రైతు సంఘాలను బలోపేతం చేయాలన్నారు. అదేవిధంగా మహిళ రైతు సంఘాలు హార్టికల్చర్, వ్యవసాయ శాఖలను సమన్వయం చేసుకొని వారి వద్ద నుంచి సబ్సిడీతో రుణాలు పొందడం వాటిని వినియోగించుకొని లాబ్‌స్టార్ట్ వ్యవసాయ సాగుకు కృషి చేయాలని మహిళా రైతు సంఘాలను కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎపిఎం జి.అప్పల నరసమ్మ, జనరల్ ఎపిఎం జాంబవతి, ఎంఎంఎస్ సభ్యులు ఆర్.సుగుణ, అకౌంటెంట్ పి.కళ్యాణి, మహిళా సంఘసభ్యులు పాల్గొన్నారు.

బ్లడ్ గ్రూప్ తెలుసుకోవాలి

పలాస : ప్రతిఒక్కరూ రక్తనమూనా పరీక్షలు చేయించుకొని తమ బ్లడ్ గ్రూప్ తెలుసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి అన్నారు. కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్, ఎన్ఎస్ఎన్ జువాలజీ విభాగంలో రక్త నమూనా పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇతరులు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు తమ బ్లడ్‌గ్రూప్ తెలుసుకోవడం వలన వారికి రక్తదానం చేసి వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఈ సందర్భంగా సుమారు 250 మంది విద్యార్థుల రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు, అధ్యాప కులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీలకు పలువురు ఎంపిక

శ్రీకాకుళం అర్బన్ : విజయనగరంలో ఈనెల 27న జరగనున్న మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలకు పలువురు బిల్డర్లు ఎంపికయ్యారు. నగరంలోని గోపాల్ పిట్‌నెస్ జిమ్ములో జిల్లా క్రీడాకారుల ఎంపిక గురువారం జరిగింది. ఈ ఎంపికలో 55 కిలోల విభాగానికి పి.రాజేష్, 60 కిలోల విభాగంలో ఎం. రఫీఖాన్, 65 కిలోల విభాగంలో డి.గణేష్, హరీష్, ఎన్.రాజు, సుమంత్, ఆర్.గణేష్, ఎ. భాస్కరరావు ఎంపికయ్యారు. మాస్టర్ క్యాటగిరీ ఎంపికైన బాడీ బిల్డర్లకు గోపాల్ ఫిట్నెస్ అధినేత గోపాల్, శ్రీకాకుళం బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బలగ ప్రసాద్, జిల్లా సెక్రటరీ వి.విజయకుమార్, టీం కోచ్ గౌరీశంకర్‌లు అభినందించారు.

రహదారి పనులకు భూమిపూజ

కోటబొమ్మాళి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కోటబొమ్మాళి మెయిన్‌రోడ్డు వరకు ఉన్న మట్టిరోడ్డుకు సిమెంట్ రోడ్డు వేసేందుకు కళాశాల ప్రిన్సిపాల్ టి.సంతోషి గురువారం భూమిపూజ చేశారు. కళాశాలకు వెళ్లే ఈ రహదారి చిన్నచిన్న వర్షాలకు సైతం బురదగా మారుతుందని, దీంతో విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు పడేవారని, ఈ విషయం ఇటీవల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు వివరించగా స్పందించి ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో ఈ రహదారిని మంజూరు చేయడంతో పనులు ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి. రాజసురేష్, సూర్యనారాయణ, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

రోడ్లపై పశువులను గోశాలకు తరలిస్తాం

పలాస: పలాస, కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో గోవులను రోడ్డుపైకి విడిచిపెడితే గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు గోవుల యజమానులకు హెచ్చరించారు. గురువారం కార్యాలయంలో గోవుల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గోవులను విచ్చలవిడిగా రోడ్డుపైకి వదిలేయడం ద్వారా పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డుపైకి గోవులు విడిచి పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికే గోవులను రోడ్డుపైకి విడిచి పెట్టవద్దని దండోరా వేయించామన్నారు. అలాగే గోవుల యజమానులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో మున్సిపల్ అధికారులు, గోవుల యజమానులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

లావేరు : ప్రజారోగ్యం, సీజనల్ వ్యాధుల ప్రభావంపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు జి.వి.లక్ష్మి, డిపిఎంఒ పి.మురళీ, శ్రీనివాసు అన్నారు. గురువారం మండలంలోని లావేరు పిహెచ్‌సి పరిధిలోని వెంకటాపురం హెల్త్‌వెల్నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. వాటర్ శాంపిల్స్ తీసి వాటి నాణ్యతను పరిశీలించాలన్నారు. మాత, శిశు ఆరోగ్య సంరక్షణపై సిబ్బంది సూచనలు చేశారు. డిప్యూటీ ఎస్ఒ శ్రీనివాస్ పట్నాయక్, సిబ్బంది ఎంఎస్ సుహాసిని, పిహెచ్ఎన్ ఎస్.ఎస్.బెనర్జీ, ప్రతుషా, పి.రాంబాబు తదితరులున్నారు.

ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఇచ్ఛాపురం: రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ ఖోఖో పోటీలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల డొంకూరుకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఎంపిక కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్ఎం జె.సరోజిని ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఇటీవల ఆర్ట్స్ కళాశాల వేదికగా 20న నిర్వహించిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో బాలికల విభాగం నుంచి వై.భవాని, డి.మీనా, పి.గీత, ధనలక్ష్మి, బాలుర విభాగం నుంచి డి.హేమంత్, డి.రవి, బి.దేవరాజులు ఎంపికయ్యారు. 25 నుంచి 27 వరకు శ్రీకాళహస్తిలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరిని ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

నేటి నుంచి పశు గణన ప్రారంభం

పోలాకి: అఖిల భారత పశుగణన నేటి నుంచి ప్రారంభమవుతుందని పశువైద్యాధికారి ఎస్. అనిల్ కుమార్ తెలిపారు. గురువారం పశువైద్య కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు మబగాంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చేతుల మీదుగా పశు గణన ప్రారంభం అవుతుందని తెలిపారు. 2018 తరువాత మరలా ప్రారంభం అవుతుందని, ఈ గణన డిసెంబర్ నెల వరకు ఉంటుందన్నారు. ఈ గణనకు రైతులు సహకరించాలని కోరారు.